నేటి కందం- నేటికి అందం

శుభలక్షణాంగి నిర్మల
అభినందన లందుకొనుచు నార్థికపరమౌ
యభివృద్ధి కోరుకొని లో
కృభలోన ప్రవేశపెట్టె చక్కని బడ్జెట్ !!

(కేంద్ర ప్రభుత్వం తరపున నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అభివృద్ధి దాయకమైనదని అందరూ ప్రశంసిస్తున్నారు?)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

ప్రతిపక్షం నేత ఐతే
ప్రశ్నించ వద్దంటరా
వెంబడించే ఆరోపణ
వేలాడితే ముద్దంటరా.
నిగ్గుదేల్చ విచారస్తే
నిరసనెందుకింతగనం
ఏదో ఒక్కటి తేలకుండా
ఎట్ల నమ్ముతారు జనం

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ మంగళవారం 3-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:145 పేజిలు:6 వెల: రూ.1/-


## ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంలోని అంశాన్ని ప్రస్తావించిన రాహుల్..

## - రాజ్‌నాథ్, అమిత్‌షా అభ్యంతరం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:న్యూఢిల్లీ: రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో సోమవారంనాడు గందరగోళం తలెత్తింది. విపక్ష నేత రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణే రాసిన పుస్తకంలోని ఒక వాక్యాన్ని ప్రస్తావించడంతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెంటనే అడ్డుకున్నారు. నరవణే పుస్తకం ఇంకా పబ్లిష్ కాలేదని, ప్రచురితం కాని పుస్తకం నుంచి వ్యాఖ్యలను పార్లమెంటరీ ప్రొసీడింగ్స్‌లో ఎలా ప్రస్తావిస్తారని నిలదీశారు. సబ్జెక్ట్‌పై మాట్లాడాలన్నారు.

రాజ్‌నాథ్ సింగ్ లేవనెత్తిన అభ్యంతరాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సమర్థించారు. 'మ్యాగజైన్ ఏదైనా రాయవచ్చు. పుస్తకం అధికారికంగా ప్రచురితం కానప్పుడు దానికి విశ్వసనీయత ఉండదు' అని అన్నారు. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాహుల్ మాట్లాడటం సరికాదన్నారు. పార్లమెంటరీ విధివిధానాలను పాటించాలని సూచించారు. దీంతో స్పీకర్ జోక్యం చేసుకుని ఆ పుస్తకం ఎక్కడుందో చూపించాలని అడిగారు. ప్రతిపక్ష నేతగా మీరు ఆరోపణలు చేస్తున్నారే కానీ సభ నిబంధనలను పాటించడం లేదన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. దీంతో రాహుల్ వెంటనే స్పందించారు. 'ఏమి మాట్లాడమంటారో దయచేసి మీరే చెప్పండి' అన్నారు. దీనిపై స్పీకర్ వెంటనే జవాబిచ్చారు. నేను మీ సలహాదారుని కాదు. స్పీకర్‌గా సభ సజావుగా సాగేలా చూడటం నా బాధ్యత. నిర్దేశించిన సబ్జెక్ట్ మీదే చర్చ ఉండాలి' అన్నారు. దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

## సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురైంది. బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త నల్లబాలుపై రాష్ట్ర హైకోర్టు తీర్పును తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీం న్యాయ స్థానం డిస్మిస్ చేసింది.

సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త నల్లబాలు పోస్టులు పెట్టారని పోలీసులు మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ కేసుపై గతంలో విచారణ చేపట్టిన రాష్ట్ర హైకోర్టు.. సదరు ఎఫ్ఐఆర్‌లను కొట్టివేస్తూ పలు మార్గదర్శకాలను జారీ చేసింది. సోషల్ మీడియా పోస్టులపై మెకానికల్‌గా కేసులు నమోదు చేయొద్దని పోలీసులకు సూచించింది. ఈ మార్గదర్శకాలు ఇబ్బందికరంగా ఉన్నాయని తెలంగాణ ప్రభుత్వ తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా గతంలో ప్రస్తావించారు. ఈ కేసును తాజాగా విచారించిన సుప్రీం న్యాయస్థానం.. హైకోర్టు తీర్పును అభినందిస్తున్నామని, మార్గదర్శకాలు ఇవ్వడంలో తప్పేమీలేదని స్పష్టం చేసింది.

## బుల్లెట్ ట్రైన్‌కు హబ్‌గా హైదరాబాద్: అశ్వినీ వైష్ణవ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌కు సమర్పించారు. ఈ బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన రైల్వే ప్రాజెక్టులతోపాటు నిధుల కేటాయింపులను రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు. సోమవారం న్యూఢిల్లీలో మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.5,454 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు.

అలాగే మూడు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు ఇచ్చామని చెప్పారు. అవి.. హైదరాబాద్ - బెంగళూరు (రెండున్నర గంటల ప్రయాణం..) , హైదరాబాద్ - చెన్నై (2:55 గంటల ప్రయాణం..), హైదరాబాద్ - పుణె (1:45 గంటల ప్రయాణం..) అంటూ సోదాహరణగా వివరించారు. బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లు అన్నీ ఎలివేటెడ్ కారిడార్‌గా నిర్మిస్తామన్నారు. అందుకు సంబంధించిన పనులను త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. బుల్లెట్ ట్రైన్‌కు హైదరాబాద్ మహా నగరం హబ్‌గా మారుతుందని స్పష్టం చేశారు. ఇది సౌత్ ఇండియా డైమండ్ హై స్పీడ్ రైల్వే ప్రాజెక్ట్ అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కంటే అధికంగా తెలంగాణ రాష్ట్రానికి రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించామని ఈ సందర్భంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. అయినా 2026-27 బడ్జెట్‌లో కేంద్రం మొండి చేయి చూపిందంటూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలోని పలువురు అగ్రనేతలు ఆరోపిస్తున్నారు. అలాంటి వేళ రైల్వే శాఖ ద్వారా తెలంగాణకు జరిగిన బడ్జెట్ కేటాయింపులను ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోదాహరణగా వివరించారు.

## జనగణనలో కులగణనన చేర్చకపోతే ఢిల్లీ గద్దె దించుతాం



హైదరాబాద్ ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దేశవ్యాప్తంగా కులగనన చేపడతామని హామీ ఇచ్చి మాట తప్పితే దేశ వ్యాప్తంగా అగ్గి రాజేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్ ను తక్షణమే సవరించి ఓబీసీ కాలమ్ చేర్చాలి దేశవ్యాప్తంగా సమగ్ర కులగనన పై ప్రస్తుత బడ్జెట్ పార్లమెంట్ సమావేశాల లో ప్రత్యేక చర్చ పెట్టాలి బీసీ కుల గనన చేయకపోతే 27 మంది ఓబీసీ కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ ప్రస్తావనలే కేంద్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను చించి నిరసన తెలిపారు.

## 150కు పైగా కాకులు మృతి.. బర్డ్ ఫ్లూ నిర్ధారణ, హెచ్చరిక జారీ

పాట్నా, ఫిబ్రవరి 2: ఒక ప్రాంతంలో సుమారు 150కు పైగా కాకులు మరణించాయి. నామూనాలు సేకరించి ల్యాబ్స్‌కు పంపారు. బర్డ్ ఫ్లూ కారణంగా ఆ కాకుల చనిపోయినట్లు నిర్ధారణ అయింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. స్థానికులకు హెచ్చరికలు జారీ చేసింది. బీహార్‌లోని భాగల్పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జనవరి 11న నౌగాచియా సబ్ డివిజన్‌లో మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన వారు వందలాది కాకులు మరణించడాన్ని గమనించారు. ఇతర పక్షులు కూడా అలాంటి స్థితిలో ఉండటం చూశారు. ఆందోళన చెందిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు.



కాగా, అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మరణించిన పక్షులను సురక్షితంగా తొలగించారు. అటవీ, పశుసంవర్ధక శాఖల సంయుక్త బృందం కలిసి సీరం నమూనాలు సేకరించారు. పరీక్ష కోసం పాట్నా, భోపాల్‌లోని ఉన్నత స్థాయి ప్రయోగశాలలకు పంపారు. బర్డ్ ఫ్లూ వైరస్ కారణంగా ఆ కాకులు మరణించినట్లు నిర్ధారణ అయ్యింది.

మరోవైపు భాగల్పూర్ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రభావిత జోన్ పరిధిలోని 10 కిలోమీటర్ల వరకు శానిటైజేషన్ డ్రైవ్ చేపట్టింది. చుట్టుపక్కల ప్రాంతంలోని కోళ్ల ఫారాల నుంచి నమూనాలను సేకరిస్తున్నారు. బర్డ్ ఫ్లూపై నిఘా, పర్యవేక్షణను ముమ్మరం చేశారు. అయితే ప్రజలు ఆందోళన చెందవద్దని అధికారులు తెలిపా రు. అనారోగ్యం చెందిన లేదా మరణించిన పక్షులను తాకవద్దని సూచించారు. పక్షుల మరణాలు గుర్తించిన వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. బర్డ్ ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ చేశారు.

## సూర్యాపేట కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గపోరు..!

### - టికెట్ రాలేదని పెట్రోల్ పోసుకొని కాంగ్రెస్ నాయకుడి ఆత్మహత్యాయత్నం

సూర్యాపేట ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ); : సూర్యాపేట జిల్లాలోని కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు భగ్గుమంటున్నది. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఆ పార్టీలో అసంతృప్త నేతలు తిరుగుబావుటాను ఎగరవేస్తున్నారు. తమకు టికెట్ కేటాయించకుంటే ఎలాంటి చర్యలకైనా సిద్ధమైని హెచ్చరిస్తున్నారు. తాజాగా ఓ నేత తనకు మున్సిపల్ ఎన్నిల్లో టికెట్ కేటాయించలేదనే ఆవేదనతో ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని 25వ వార్డులో కాంగ్రెన్ టికెట్ ఇవ్వలేదని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకుడు కోడి శివ యాదవ్ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడ్డాడు. గత మున్సిపల్ ఎన్నికల్లో తనకు టికెట్ ఇవ్వకుండా వేరే వాళ్లకు ఇస్తే సపోర్ట్ చేశామన్నారు. కానీ, ప్రస్తుతం తనకు ఇవ్వాల్సి ఉండగా అలా కాకుండా రమేష్ రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తికి ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

## జాతీయ వార్షిక బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేసిన లోక్‌సత్తా

హైదరాబాద్ ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ ఉచితాల ప్రస్తావన లేకుండా ఆడంబరాలకు పోకుండా అభివృద్ధి పథం వైపు దృష్టి సారించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన 2026-27వార్షిక జాతీయ బడ్జెట్ ప్రశంస నీయంగా ఉందని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాసు హర్షం వ్యక్తం చేశారు. అమెరికా ఆర్థిక విధానాలతో కూదేలవు తున్న దేశాలు ఒకవైపు రష్యా - ఉక్రెయిన్ ఇతర యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో కూడా దేశం 7% వృద్ధిని నమోదు చేయడం, జాతీయ స్థాయిలో వస్తోన్న ఆదాయంలో రాష్ట్రాలకు గతం 41% నుండి 54% పెంచడం, స్థానిక ప్రభుత్వాలకు గతం కంటే 20% నిధులు అదనంగా పెంచడం, జాతీయ ఆదాయంలో అప్పుల శాతం 5% వరకు తగ్గించడం, పెట్టుబడుల కింద 12.2 లక్షల కోట్లకు పెంచడం, మౌలిక సదుపాయల కల్పనకు 14లక్షల కోట్లకు పైగా కేటాయించడం, ప్రతీ జిల్లాలో బాలికలకు హాస్టల్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. విద్యా, ఆరోగ్య, ఉపాధి రంగాలకు అదనంగా నిధుల కేటాయించకపోవడం బాధగాకరంగా ఉందని ఆయన అన్నారు.

## ఓట్ల కోసమే ఇందిరమ్మ ఇళ్లు: టీ బీజేపీ చీఫ్

హైదరాబాద్, ఫిబ్రవరి 2:: రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నిప్పులు చెరిగారు. సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ పీపుల్స్ ప్లాజాలో 'బూటకపు హామీలు - మోసపూరిత వాగ్దానాలు' అంటూ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఛార్జ్‌షీట్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ బూటకపు హామీలు, మోసపూరిత వాగ్దానాలు, సేవ్ తెలంగాణ, ఓట్ బీజేపీ థీమ్‌తో ఈ ఛార్జ్ షీట్‌ను విడుదల చేశామన్నారు. గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు.

రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వలేని పరిస్థితుల్లో రేవంత్ ప్రభుత్వం ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని.. కానీ నేటికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఆరోగ్య శ్రీ పథకం కింద వేల కోట్ల రూపాయిల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్యం పూర్తిగా కుంటుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ సంపూర్తిగా అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయని.. తద్వారా లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని వివరించారు. షో పుటప్ తప్ప.. రాష్ట్రంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు లేదంటూ రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఓట్ల కలెక్షన్ల కోసమే ఇందిరమ్మ ఇళ్లు అంటూ ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీలకు చేసిందేమిటో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు.

7 మున్సిపల్ కార్పొరేషన్లలో టాక్సీల పేరు మీద భారీ కుంభకోణం జరుగుతోందని విమర్శించారు. దీనిలో రూ. 250 కోట్లకుపైగా కుంభకోణం జరిగిందని వివరించారు. మున్సిపాలిటీలకు వచ్చే నిధుల్లో ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నవేనని గుర్తు చేశారు. రాష్ట్రంలో రహదారులన్నీ అధ్వానంగా మారాయని.. నిత్యం రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది మరణిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో క్రైమ్ విపరీతంగా పెరిగిపోయిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలం అయిందన్నారు. డ్రగ్స్‌కు కేంద్రంగా తెలంగాణ మారిపోయిందంటూ మండిపడ్డారు.

హిందూ దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. చివరకు దేవాలయాల భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. కమిషన్, కాంట్రాక్ట్, కరప్షన్ ప్రభుత్వమని అభివర్ణించారు. ఇది 40 పర్సెంట్ కమిషన్ ప్రభుత్వమని వ్యంగ్యంగా అన్నారు. తమ ఫోన్లు ట్యాపింగ్ చేసి.. తమపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు.

ఫోన్ ట్యాపింగ్ చేయవలసిన అవసరం ఎందుకొచ్చిందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. తొలుత బీజేపీ నేతల ఫోన్లనే ట్యాపింగ్ చేశారని గుర్తు చేశారు. సేవ్ తెలంగాణ.. ఓట్ బీజేపీ నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఆలోచించాలని, గతంలో రెండు పార్టీలకు అవకాశం ఇచ్చారని.. ఒకసారి బీజేపీకి కూడా అవకాశం ఇవ్వండంటూ టీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు.

## బాలల వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : ఎస్పీ నరసింహ

### - ఆపరేషన్ స్మైల్‌లో 176 మంది రెస్క్యూ

సూర్యాపేట ఫిబ్రవరి 02 : బాలల వికాసానికి, వారి బంగారు భవిష్యత్‌కు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నర్సింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆపరేషన్ స్మైల్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వెట్టి చాకిరికి, నిరాదరణకు గురైన బాలబాలికలు, తప్పిపోయి వచ్చిన బాలలను గుర్తించి సంరక్షించడంలో బాగంగా ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా నిరాదరణకు, వెట్టిచాకిరీ గురవుతున్న 176 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులకు, సమరక్షులకు క్షేమంగా అప్పగించడం జరిగినదన్నారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు 56 మందిలో 49 మంది బాలురు, 7 గురు బాలికలు ఉన్నారన్నారు.

అలాగే ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 120 మంది బాలలు ఉండగా వీరిలో 80 మంది బాలురు, 40 మంది బాలికలు ఉన్నట్లు తెలిపారు. అధికారుల పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా రెస్క్యూ టీమ్స్ వివిధ ప్రదేశాల్లో వీరందరినీ గుర్తించి రక్షణ కల్పించడం జరిగినదన్నారు. బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించి బాలల వికాసానికి ప్రతిఒక్కరూ తోడ్పడాలన్నారు. బాలల రక్షణలో పోలీసు తనిఖీలు ని ం ం త ం ం గా నిర్వహిస్తామన్నారు. బాలలను వెట్టిచాకిరి గురిచేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ రవి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, పోలీస్ ఐటీ అర్ఎస్ఐ రాజశేఖర్, చైల్డ్ సంరక్షణ అధికారులు రవి, నాగుల మీరా, స్మైల్ బృందం ఎస్ఐ మల్లేశం, ఏఎస్ఐ వెంకన్న, స్మైల్ టీమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఢిల్లీలో నిర్వహించే పీఆర్‌టీయూ ధర్నా పోస్టర్ ఆవిష్కరణ




నల్గొండ, ఫిబ్రవరి 2: ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలనే డిమాండ్‌తో ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఢిల్లీలో చేపట్టే ధర్నా కార్యక్రమం పోస్టర్‌ను పీఆర్‌టీయూ భవన్ నల్లగొండ నందు సోమవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ నల్లగొండ జిల్లా శాఖ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి జానారెడ్డి, గౌరవ అధ్యక్షుడు టి.సత్తయ్య, వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు విజయకుమార్ రెడ్డి, మారం వెంకట్ రెడ్డి, డి.కళావతి, పోలె వెంకటయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ పాషా, కొర్ర లోక్యా నాయక్, పుల్లయ్య, సైదిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వలి బాషా, రమేష్, రవీందర్ రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

## దుండిగల్ పీఎస్ పరిధిలో వృద్ధురాలు దారుణ హత్య

హైదరాబాద్, ఫిబ్రవరి 2: నగరంలో దుండగులు రెచ్చిపోతున్నారు. ప్రతిరోజు ఏదో ఓ మూల నేరాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా ఒంటరి మహిళలు, వృద్ధులపై దాడులకు, హత్యలకు తెగపడుతున్నారు. తాజాగా దుండిగల్ పీఎస్ పరిధిలోని చర్చి గాగిల్లాపూర్‌లో సుశీలమ్మ(70) అనే వృద్ధురాలు హత్యకు గురైంది.

తన ఇంట్లోనే సోఫాపై రక్తపు మడుగులో పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్‌టీంతో దర్యాప్తు చేస్తున్నారు. నగలు, నగదు దోచుకోవడానికి వచ్చి ఈ దారుణానికి పాల్పడ్డారా , మరేదైనా కారణం ఉందా.. అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తల్లి ఆత్మహత్యాయత్నం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: తన ముగ్గురు పసిపిల్లలను ఉరేసి చంపి, ఆపై డీజిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కర్ణాటకలోని బాగల్‌కోట్ లో చోటుచేసుకుంది. రూప అనే మహిళ తన ముగ్గురు పసిపిల్లలను ఉరేసి చంపి, ఆపై డీజిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.

ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ దారుణానికి పాల్పడింది. భర్త స్థానికుల సాయంతో ఇంటి తలుపులు పగులగొట్టి చూడగా పిల్లలు అప్పటికే చనిపోయి కనిపించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రూపను ఆసుపత్రికి తరలించారు. అత్తింటి వేధింపుల వల్లే ఆమె ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

# వృత్తి నిబద్ధతకు నిలువెత్తు రూపాలు మహిళా వైద్యులు

## (ఫిబ్రవరి 03న "జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం" సందర్భంగా)

1849లో అమెరికాలో వైద్య పట్టా పొందిన తొలి మహిళ 'డాక్టర్: ఎలిజబెత్ బ్లాక్‌వెల్' జన్మదినాన్ని పురస్కరించుకుని 2016 నుండి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 03న "జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం (నేషనల్ వూమెన్ ఫిజీషియన్స్ డే)" జరుపుకుంటున్నాం. పవిత్రమైన వైద్య వృత్తి నుండి మహిళలను దూరంగా ఉంచిన అడ్డంకులను ఈ చారిత్రాత్మక సంఘటన బద్దలు కొట్టింది. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవ వేదిక వైద్య రంగంలో మహిళల అంకితభావం, పోరాట పటిమ, కరుణ హృదయాలను హైలైట్ చేస్తుంది, అదే సమయంలో కార్యాలయాల్లో లింగ సమానత్వ సాధన, పౌర సమాజ మద్దతు అవసరాన్ని పరిష్కరించడానికి దోహదపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఆసుపత్రులు, క్లినిక్‌లు, వైద్య పరిశోధనా రంగాల్లో అద్భుతమైన నైపుణ్యాలు, సహానుభూతి, రోగుల సంరక్షణ, వృత్తి నిబద్ధత కలిగి తమ జీవితాలను వైద్య రంగానికి అంకితం చేసిన మహిళా వైద్యులు ఎందరో మన ముందు ఉన్నారు.

### వైద్య రంగంలో లింగ అసమానతలు:

జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం సందర్భంగా మహిళా వైద్యుల నిస్వార్థ సేవలను గుర్తించడం మాత్రమే కాకుండా, లింగ వేతన అంతరాలు, నాయకత్వ బాధ్యతలతో సహా కొనసాగుతున్న పలు అసమానతలను పరిష్కరించడానికి పిలుపునిస్తున్నది. ప్రస్తుతం దాదాపు 35 శాతం మంది వైద్యులు మహిళలు ఉన్నప్పటికీ, వైద్యపరంగా మరింత మెరుగైన లింగ సమానత్వాన్ని కోరుతున్నారు. ఈ రోజు మహిళా వైద్యులు అభివృద్ధి చెందడానికి, ఆవిష్కరణలు చేయడానికి, అడ్డంకులు లేకుండా నడిపించడానికి సమగ్ర వాతావరణాన్ని కూడా కల్పించాల్సి ఉంటుంది. మహిళా ఫిజీషియన్లు రోగులను నయం చేయడమే కాకుండా, రేపటి తరం మహిళా వైద్యులకు స్ఫూర్తినిస్తున్నారు. పౌర సమాజ జీవితాలను మెరుగుపరచడం, రోగులను జాగ్రత్తగా చూసుకోవడం, ఆధునిక వైద్యం యొక్క సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవడం లాంటి అంశాల్లో వారి నిబద్ధతను అభినందించాలి. దాదాపు మూడింట ఒక వంతు మహిళా వైద్యులందరూ కార్యాలయంలో లైంగిక వేధింపులు, ఎక్కువ మంది లింగ పక్షపాతాన్ని ఎదుర్కొంటున్నారు.

### భారతదేశంలో మహిళా వైద్యులు:

భారతదేశంలో 19వ శతాబ్దం చివరలో పాశ్చాత్య ఆధునిక వైద్యాన్ని మొదటగా అభ్యసించిన డాక్టర్: ఆనందీబాయి జోషి (1886), డాక్టర్: కాదంబినీ గంగూలీ (1886) వంటి మహిళామణులు ఇతర మహిళా వైద్యులకు మార్గదర్శకులుగా ఎదిగారు. ప్రస్తుతం ఓ:బా విద్యార్థులలో దాదాపు 50 శాతం మంది మహిళలు ఉండడం లింగ అంతర నివారణకు గొప్ప సంకేతం. ఎక్కువ మంది మహిళా వైద్యులు ప్రసూతి (60 శాతం), గైనకాలజీ (60 శాతం), పీడియాట్రిక్స్ (58 శాతం), జనరల్ ప్రాక్టీస్ (57 శాతం), పబ్లిక్ హెల్త్ (55 శాతం) రంగాలను ఎంచుకుంటున్నారు, కానీ ఇప్పుడు వారు సూపర్ స్పెషాలిటీల ద్వారా అన్ని రంగాల్లోకి ప్రవేశిస్తున్నారు. సంఖ్య పెరుగుతున్నప్పటికీ, భారతదేశంలోని మొత్తం వైద్యుల్లో 14.2 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. జాతీయ ఆరోగ్య సంస్థలలో నాయకత్వ పాత్రలలో 28 శాతం మాత్రమే మహిళా వైద్యులు నిర్వహిస్తున్నారు. డాక్టర్: ఆనందీబాయి జోషి (మొదటి భారతీయ మహిళా వైద్యులు), డాక్టర్: కేతన్యున్ అర్దేశిర్ దిన్షా (మొదటి మహిళా రేడియోథెరపిస్ట్), డాక్టర్: ఇందిరా హిందూజా (మొదటి టెస్ట్ ట్యూబ్ బేబీని ప్రసవించారు), డాక్టర్: మంజుల అనగాని (లాపరోస్కోపిక్ సర్జన్), డాక్టర్: గగన్‌దీప్ కాంగ్ (రాయల్ సొసైటీ మొదటి మహిళా ఫెలో) వంటి మేటి మహిళా వైద్యులు భారతదేశ వైద్య రంగానికి చారిత్రాత్మక కృషి చేశారు. భారతదేశంలోని మహిళా వైద్యులు నేడు తీవ్రమైన వృత్తి-కుటుంబ సంఘర్షణ, లింగ పక్షపాతం, పరిమిత కార్యాలయ అభద్రత, వివక్షత, వేధింపులు వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నారు.

వైద్యులకు వృత్తి-వ్యక్తిగత జీవన సమతుల్యత, మానసిక ఆరోగ్య మద్దతు అవసరాన్ని గుర్తిద్దాం. ప్రస్తుత పౌర సమాజం, తల్లిదండ్రులు తమ యువ బిడ్డలు, బాలికలను వైద్య రంగంలోకి రావడానికి ప్రోత్సహించాలి. మహిళల వైద్య రంగ ప్రవేశం, సమానత్వ సాధనలకు సహాయపడే ఉద్యమాన్ని ప్రారంభించండి. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం రోజు మహిళా వైద్యుల అద్భుతమైన విజయాలను కొనియాడడం, సహోద్యోగుల సహాయ పడడం, స్నేహితుల ప్రోత్సాహం అందించడం, కుటుంబ సభ్యుల చేయూత, ఇతర వైద్యుల సహకారం, పౌర సమాజం మద్దతు ఇవ్వడం మన కనీస కర్తవ్యం అని భావిద్దాం.

–డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# బాధ్యత భావం స్ఫూర్తిగా... యువశక్తి, నారీ శక్తి బలోపేతం లక్ష్యంగా బడ్జెట్: శ్రీ అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈ రోజు పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. భారత విద్య, నైపుణ్యాల వ్యవస్థ కోసం ఒక పరివర్తనాత్మక ప్రణాళికను సమర్పించిన ఆర్థిక మంత్రి... ఆరెంజ్ ఎకానమీని ప్రోత్సహించడానికి, దేశంలో సృజనాత్మక పరిశ్రమల బలోపేతం కోసం కీలక కార్యక్రమాలను వివరించారు.దేశంలో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ) రంగం వేగవంతమైన వృద్ధిని హైలైట్ చేస్తూ... 2030 నాటికి పరిశ్రమకు దాదాపు 20 లక్షల మంది వృత్తి నిపుణుల అవసరం ఉంటుందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. విస్తరిస్తున్న ఈ వ్యవస్థకు ఊతమివ్వడం కోసం దేశవ్యాప్తంగా 15,000 మాధ్యమిక పాఠశాలలు, 500 కళాశాలల్లో ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడానికి ముంబయిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్‌కు సహాయం అందించాలని ఆమె ప్రతిపాదించారు. ఈ ల్యాబ్‌లు యువతకు సృజనాత్మక రంగంలో కొత్త ఉపాధి అవకాశాలను అందిస్తాయని భావిస్తున్నారు.భవిష్యత్తుకు సిద్ధంగా ఉండేలా నిపుణులను తయారు చేయడం, భారత సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, దేశవ్యాప్తంగా అభ్యాసకులకు అవకాశాలను విస్తరించడం దిశగా గణనీయ పురోగతిని ఈ కార్యక్రమం సూచిస్తుంది.కేంద్ర బడ్జెట్ ప్రకటనలపై ఈ రోజు రైల్ భవన్‌లో మీడియాతో మాట్లాడిన కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్... "ఇది యువశక్తి, మహిళా శక్తి స్ఫూర్తితో రూపొందించిన బాధ్యతల ఆధారిత బడ్జెట్" అని వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'వేవ్స్' కార్యక్రమం ద్వారా భారత సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను ప్రపంచ వేదికపై సగర్వంగా నిలబెట్టారని ఆయన పేర్కొన్నారు. ఐఐటీలు, ఐఐఎంల తరహాలో స్థాపించిన ఐఐసీటీ ముంబయి... క్రియేటర్స్ ల్యాబ్స్ ద్వారా 15,000 పాఠశాలలు, 500 కళాశాలలతో అనుసంధానం ద్వారా 20 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని ఆయన తెలిపారు. ఆడియో-విజువల్ ప్రొడక్షన్, ప్రసారం, డిజిటల్ కంటెంట్, యానిమేషన్, గేమింగ్, ప్రచారం, ప్రత్యక్ష వినోదాలను మిళితం చేస్తూ భారత మీడియా-వినోద (ఎమ్ఆండ్ఈ) రంగం సేవారంగ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా మారిందని ఆర్థిక సర్వే ప్రస్తావించింది. గత దశాబ్ద కాలంలో ఈ రంగం ఆదాయ నమూనాలు, ఉపాధి, సరుకు రవాణా వ్యవస్థలను పరివర్తన చెందించడం ద్వారా డిజిటల్, ప్లాట్‌ఫామ్-ఆధారిత డెలివరీ దిశగా బలమైన ముందడుగు వేసింది. 2024లో సుమారు రూ. 2.5 ట్రిలియన్లుగా అంచనా వేసిన ఈ వృద్ధి పెరుగుతున్న ఆదాయాలు, ఇంటర్నెట్ వ్యాప్తి, ఓటీటీ విస్తరణ, ఏఐ- నేతృత్వం లోని ఆవిష్కరణల ద్వారా ముందుకు సాగుతోంది.సృజనాత్మకత, సంస్కృతి, మేధో సంపత్తి ఆధారంగా ముందుకు నడిచే ఆర్థిక వ్యవస్థను "ఆరెంజ్ ఎకానమీ" సూచిస్తుంది. ఇక్కడ ప్రధానంగా భౌతిక వస్తువుల కంటే ఆలోచనలు, జ్ఞానం, కళాత్మక వ్యక్తీకరణ, సాంస్కృతిక కంటెంట్ ద్వారా విలువ ఏర్పడుతుంది.

# 15మంది మృతి, పలువురికి గాయాలు

అమరావతి, ఫిబ్రవరి 2: రష్యా- ఉక్రెయిన్ మధ్య చర్చలు జరగనున్న నేపథ్యంలో రష్యా మరోసారి ఉక్రెయిన్ పై దాడి చేసింది. ఆ దేశంలోని వివిధ ప్రాంతాలపై డ్రోన్లతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో 15 మంది మరణించగా, అనేక మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఉక్రెయిన్‌లోని ఆగ్నేయ డ్నిప్రోపెట్రోవ్స్క్ ప్రాంతంలో గని కార్మికులను తీసుకెళ్తున్న బస్సుపై రష్యా డ్రోన్ దాడి చేసిందని ఆ దేశ ఇంధన మంత్రి తెలిపారు. ఈ ఘటనలో 12 మంది మరణించారని చెప్పారు. అంతకు ముందు రాత్రిపూట, ఆదివారం జరిగిన వేర్వేరు రష్యన్ దాడుల్లో ఇద్దరు మరణించగా, తొమ్మిది మంది గాయపడ్డారని తెలిపారు. టెర్నివ్కా నగరం లో ఈ దాడి జరిగిందని పోలీసులు తెలిపారు. రాష్ట్ర అత్యవసర సేవ పోస్ట్ చేసిన ఫుటేజ్‌లో కాలిపోయిన బస్సు కిటికీలు రోడ్డు పక్కన పగిలిపోయాయి.

అయితే ఈ దాడులను రష్యా ఇంకా అధికారికంగా ధృవీకరించలేదు. అయతే రష్యా, ఉక్రెయిన్ మధ్య మరోసారి చర్చలు జరగనున్నాయని జెలెన్ స్కీ ఇటీవలే ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఈ దాడులు జరగడం గమనార్హం.

# ఆంధ్రప్రదేశ్ ఆఫ్ఘనిస్తాన్‌లా మారింది..

–టీటీడీ లడ్డూలలో జంతు అవశేషాలు కలవలేదని రెండు జాతీయ లేబరేటరీలు నిర్ధారించాయి
–లడ్డు విషయంలో కూటమినాయకులు దోషులుగా తేలేరు
–అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై దాడి దురదృష్టకరం
–కేసులు కి దాడులకి భయపడే ప్రసక్తి లేదు
–వైసీపీ యువజన విభాగం కృష్ణాజిల్లా అధ్యక్షుడు మెరుగుమాల ఖాళీ



అమరావతి, ఫిబ్రవరి 2: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి లడ్డు ప్రసాదములో జంతు అవశేషాలు కలవలేదని చెప్పడంతో ప్రపంచవ్యాప్తంగా హిందూ బంధువులు హర్షం వ్యక్తం చేస్తుంటే చూడలేని కూటమి ప్రభుత్వ నాయకులు వైసిపి నాయకుల ఇళ్లపై మారణాయుధాలతో దాడులు చేస్తూ టాపిక్ డైవర్ట్ చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. మెడికల్ కాలేజీ లపై మాట్లాడినందుకు పేర్ని నాని, కల్తీ మద్యంపై మాట్లాడినందుకు జోగి రమేష్ , కల్తీ లడ్డు గురించి మాట్లాడుతున్నందుకు అంబటి రాంబాబులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు.

వైసీపీ నాయకుల ఇళ్లపై ఆఫీసులపై దాడులు చేస్తుంటే పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి, గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో వైసీపీ సీనియర్ నాయకులు పాలేటి చంటి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జాన్ విక్టర్, కందుల నాగరాజు,అద్దేపల్లి పురుషోత్తం, ఎస్ కే బాజీ, గంట సురేష్, గుదే రవి, చుండూరు శేఖర్, కే ఎన్ ఎస్ వి ప్రసాద్, సమోసాల నాని, కరీముల్లా, అడప హర్ష, జ్యోతుల మణికంత, సురేఖ ,రమీజా, పుల్లేటికుర్తి కృష్ణారావు, పాగోలు రాఘవులు, జోషి, కలపాల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో సామాజిక భాగస్వామ్యం అవసరం జిల్లా విద్యాశాఖ అధికారులు



చిత్తూరు, ఫిబ్రవరి 2: పాఠశాలల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో సామాజిక భాగస్వామ్యం అత్యంత కీలకమని సమగ్ర శిక్షా చిత్తూరు ఏపీసీ మద్దిపట్ల వెంకటరమణ, జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాజేంద్రప్రసాద్ స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ఒక్క ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాక సమాజం మొత్తం కలిసికట్టుగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యాంజలి కార్యక్రమం అమలుపై జిల్లా స్థాయి ఒకరోజు శిక్షణా కార్యక్రమం చిత్తూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించబడింది.

జిల్లాలోని 31 మండలాల నుంచి మండల విద్యాశాఖ అధికారులు, ప్రతి మండలం నుంచి ఒక రిసోర్స్ పర్సన్, ఒక స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఛైర్‌పర్సన్, ఒక క్లస్టర్ హెడ్‌మాస్టర్ పాల్గొన్నారు. శిక్షణా కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించి, జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యాలకు అనుగుణంగా పాఠశాలలు సమాజంతో అనుసంధానం కావాల్సిన అవసరాన్ని వివరించారు.

"విద్యాంజలి" అనే పదానికి విద్య అంటే జ్ఞానం, అంజలి అంటే సహృదయంతో సమర్పించడం అనే అర్థం ఉన్నదని, అదే ఈ కార్యక్రమం యొక్క మూలసారమని శిక్షణలో తెలిపారు. పాఠశాలల అవసరాలను ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు గుర్తించి ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేస్తారు. స్వచ్ఛంద సేవలు అందించాలనుకునే వాలంటీర్లు లేదా సంస్థలు తమ సేవలను బోధన రూపంలో గానీ, వస్తు రూపంలో గానీ నమోదు చేసుకోవచ్చు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, గృహిణులు, వ్యాపారవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు రిసోర్స్ పర్సన్లుగా సేవలందించవచ్చని వివరించారు. తమ నైపుణ్యానికి అనుగుణంగా పాఠ్యాంశ బోధన, చిత్రలేఖనం, పెయింటింగ్, ఇతర కళలు, జీవన నైపుణ్యాలు బోధించడమే కాక పాఠశాలలకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగస్వామ్యం కావచ్చని చెప్పారు.

పోర్టల్‌లో నమోదైన అవసరాలను తగిన వాలంటీర్లతో అనుసంధానం చేసి ఆయా పాఠశాలలకు సేవలు అందేలా మ్యాపింగ్ ప్రక్రియ జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ సేవలు పూర్తిగా స్వచ్ఛందమైనవని, ఎటువంటి పారితోషికం లేదా జీతభత్యాలు ఉండవని స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారిక మార్గాల ద్వారానే సేవలు అందించాలని సూచించారు.

జిల్లాస్థాయి శిక్షణ అనంతరం మండల స్థాయిలో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 4న ప్రతి మండలంలో ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించి మండలంలోని ఇద్దరు ఎంఈఓలు, క్లస్టర్ హెచ్‌ఎంలు, ఎన్‌జీఓలు, ఎస్ఎంసి ఛైర్‌పర్సన్లు, సీఆర్‌పీలు పాల్గొననున్నారు. ఈ విధంగా విద్యాంజలి 2.0 కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు సమాజ సహకారంతో మరింత బలపడతాయని విద్యాశాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై మంత్రులు సమీక్ష

అమరావతి, ఫిబ్రవరి 2: శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనిత, బీసీ జనార్దన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈనెల 14, 15, 16 తేదీల్లో జరిగే బ్రహ్మోత్సవాలకు 50శాతం భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉందని మంత్రి ఆనం పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల నుంచి ఎలాంటి రుసుం తీసుకోకుండా భక్తుల వాహనాలు అనుమతించాలన్నారు.

సామాన్య భక్తులకు ప్రాధాన్యత, సౌకర్యాలు మెరుగ్గా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. దోర్నాల ఆత్మకూరు రహదారి మరమ్మతులు పూర్తి చేయాలని మంత్రి జనార్ధన్ రెడ్డి అధికారులని ఆదేశించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్, భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు హోంమంత్రి అనిత వెల్లడించారు.

# అంచనా ప్రాతిపదికన పన్ను చెల్లించే ప్రవాస భారతీయులకు కనీస ప్రత్యామ్నాయ పన్ను (ఎంఏటీ) నుంచి మినహాయింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఇవాళ పార్లమెంటులో కేంద్ర బడ్జెట్ 2026-27ను ప్రవేశపెడుతూ దేశంలో కీలకమైన మౌలిక సదుపాయాలను పెంపొందించటం, డేటా సెంటర్లలో పెట్టుబడులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తిస్తూ, కీలక ప్రతిపాదన చేశారు. భారతదేశం నుంచి డేటా సెంటర్ సేవలను తీసుకుని అంతర్జాతీయ వినియోగదారులకు క్లౌడ్ సేవలందించే ఏ విదేశీ కంపెనీలకైనా 2047 వరకు టాక్స్ హాలిడే ప్రకటించాలని ఆమె ప్రతిపాదించారు. అయితే భారత సంబంధిత సంస్థ ద్వారానే భారతీయ వినియోగదారులకు సేవలు అందిచాల్సి ఉంటుంది. భారతదేశం నుంచి డేటా సెంటర్ సేవలు అందిస్తున్న కంపెనీ, సేవలు పొందుతున్న సంస్థకు అనుబంధ సంస్థ అయితే, సేవా వ్యయంపై 15 శాతం సేఫ్ హార్బర్ వర్తింపచేయాలని కేంద్ర బడ్జెట్ ప్రతిపాదించింది.

ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీలో సమయానుకూల సరఫరా వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచేందుకు, విదేశీ సంస్థలు బాండెడ్ గిడ్డంగుల్లో విడిభాగాలను నిల్వ చేసుకునేలా బడ్జెట్ లో సేఫ్ హార్బర్ నిబంధనను కేంద్ర ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. దీని ప్రకారం ఇన్‌వాయిస్ విలువపై 2 శాతం లాభ పరిమితిని నిర్ణయిస్తారు. దీనివల్ల సుమారు 0.7 శాతం పన్ను ఉంటుంది. ఇతర పోటీ దేశాలతో పోల్చితే ఇది చాలా తక్కువ.

భారతదేశంలో టోల్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాన్ని ప్రోత్సహించటానికి, కేంద్ర ఆర్థిక మంత్రి 2026-27 బడ్జెట్‌లో చేసిన కీలక ప్రతిపాదన ప్రకారం.. బాండెడ్ జోన్‌లో ఉన్న ఏ టోల్ మాన్యుఫ్యాక్చరర్‌కైనా మూలధన వస్తువులు, యంత్రాలు లేదా టూలింగ్‌ను సరఫరా చేసే విదేశీ సంస్థలకు ఐదేళ్ల పాటు ఆదాయ పన్ను నుంచి మినహాయింపు లభిస్తుంది.

నోటిఫై చేసిన పథకాల ప్రకారం భారతదేశానికి వచ్చే విదేశీ నిపుణులు ఇక్కడ ఐదేళ్ల పాటు ఉన్నప్పటికీ అంతర్జాతీయ (విదేశాల్లో సంపాదించిన దానికి) ఆదాయంపై పన్ను మినహాయింపు ఇవ్వాలని బడ్జెట్ ప్రతిపాదించింది. ప్రపంచవ్యాప్తంగా అపారమైన ప్రతిభ గలవారు భారత్‌లో ఎక్కువకాలం పాటు పనిచేసేలా ప్రోత్సహించటమే దీని ముఖ్య ఉద్దేశం.

అంచనా ప్రాతిపదికన పన్ను చెల్లించే ప్రవాస భారతీయులకు కనీస ప్రత్యామ్నాయ పన్ను (ఎంఏటీ) నుంచి మినహాయింపునివ్వాలని కేంద్ర బడ్జెట్ ప్రతిపాదించింది.

# తూర్పు భారత్‌లో డిజైన్‌కు సంబంధించిన విద్య, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు ఒక కొత్త జాతీయ డిజైన్ సంస్థ ఏర్పాటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:శ్రీమతి నిర్మలా సీతారామన్ నేడు పార్లమెంటులో కేంద్ర బడ్జెట్ 2026-27ను ప్రవేశపెట్టారు. సామాన్య ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, భారత శ్రేయస్సులో బలమైన భాగస్వాములుగా మార్చేందుకు వారి సామర్థ్యాన్ని పెంపొందించడం అనే 'రెండో కర్తవ్యాన్ని' సాకారం చేయడంలో వర్ధమాన సాంకేతికతలు, ఏఐ ముఖ్యమైన అంశాలని బడ్జెట్ పేర్కొంది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడం అనేది రైతులు, స్టెమ్ రంగంలోని మహిళలు, నైపుణ్యం పెంపొందించుకోవాలనే ఆసక్తి ఉన్న యువత- దివ్యాంగులకు కొత్త అవకాశాలను కల్పించి అందరికీ ప్రయోజనం చేకూరుస్తుందని బడ్జెట్ గుర్తించింది. ఏఐ మిషన్, నేషనల్ క్వాంటం మిషన్, అనుసంధాన్ జాతీయ పరిశోధన నిధి, పరిశోధన – అభివృద్ధి – ఆవిష్కరణ నిధి ద్వారా కొత్త సాంకేతికతలకు మద్దతు ఇచ్చే ప్రభుత్వ కీలక కార్యక్రమాలను 2026-27 కేంద్ర బడ్జెట్ ప్రధానంగా పొందుపరిచింది. భారతదేశపు 'ఆరెంజ్ ఎకానమీ'లో వర్ధమాన సాంకేతికతలు కీలక పాత్ర పోషిస్తున్నందున 2030 నాటికి 2 మిలియన్ల మంది నిపుణులు అవసరమయ్యే అభివృద్ధి చెందుతున్న పరిశ్రమగా యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ) రంగాన్ని బడ్జెట్ ప్రముఖంగా ప్రస్తావించింది. భారత 'ఆరెంజ్ ఎకానమీ'ని మరింత ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా 15,000 ఉన్నత పాఠశాలలు, 500 కళాశాలల్లో ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసేందుకు ముంబయిలోని భారత క్రియేటివ్ టెక్నాలజీస్ సంస్థకు మద్దతు ఇవ్వాలని కేంద్ర బడ్జెట్ ప్రతిపాదిస్తోంది.భారత్‌లో డిజైన్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తున్నందున దేశంలోని తూర్పు ప్రాంతంలో డిజైన్‌కు సంబంధించిన విద్య, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు ఒక కొత్త జాతీయ డిజైన్ సంస్థను ఏర్పాటు చేయాలని బడ్జెట్ ప్రతిపాదిస్తోంది.

అగ్రిస్టాక్ పోర్టల్‌లను, ఐసీఏఆర్ వ్యవసాయ పద్ధతుల ప్యాకేజీని ఏఐ వ్యవస్థలతో అనుసంధానించే 'భారత్-విస్తార్'అనే బహుభాషా ఏఐ సాధనాన్ని తీసుకురానున్నట్లు బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది వ్యవసాయ ఉత్పాదకతను పెంచటంతో పాటు రైతులు మెరుగైన నిర్ణయాలు తీసుకోవడానికి తోడ్పడుతుంది. దీనితో పాటు రైతులకు వ్యక్తిగతీకరించిన సలహాలను అందించటంలో మద్దతనివ్వటం ద్వారా నష్టభయాన్ని తగ్గిస్తుంది. ఉద్యోగాలు, నైపుణ్య అవసరాలపై ఏఐ, ఇతర వర్ధమాన సాంకేతికతల ప్రభావాన్ని అంచనా వేసేందుకు, ఈ విషయంలో తగిన చర్యలను ప్రతిపాదించడానికి 'విద్య నుంచి ఉద్యోగం, వ్యవస్థాపకత' అనే ఉన్నత స్థాయి స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని బడ్జెట్ ప్రతిపాదించింది.

# గులాబి జెండా ఎగరాలి ..

–జనగామ మున్సిపల్ లో ఎన్నికల ప్రచారం ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

జనగామ, ఫిబ్రవరి 2: జనగామ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ రోజు పట్టణ కేంద్రంలోని 1,2,3,4,14,15 వార్డుల లోను పార్టీ అభ్యర్థులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల్లోకి వచ్చిన ఎమ్మెల్యే పల్లా కు స్థానిక ప్రజలు, తిలకం దిద్దుతూ, మంగళ హారతులు ఇస్తూ, డప్పు వాయిద్యాల మధ్యన, పూల వర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ గులాబి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే జనగామ ప్రాంతం అభివృద్ధి చెందిందని, జిల్లా కలెక్టరేట్ భవనం, మెడికల్ కాలేజీ, ప్రభుత్వ ఆసుపత్రి ల ఏ ర్పాటులతో ఎంతో అభివృద్ధి చెందిందని, కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల పథకం అమలులో చిత్తశుద్ధి కరువైందన్నారు. జనగామ ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపే మొగ్గు చూపారన్నారు. ఈ కార్యక్రమంలో పలు వార్డులలోని కౌన్సిలర్లు, క్లస్టర్ ఇంచార్జిలు, వార్డు ఇన్చార్జిలు పాల్గొన్నారు..

# సీఎం సభకు..చకాచకా ఏర్పాట్లు పటిష్టమైన భద్రత

## -సభాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే, సీపీ

చొప్పదండి, ఫిబ్రవరి 2: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన కోసం కరీంనగర్



జిల్లా చొప్పదండిలో చకాచకా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈనెల 5న చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఇవాళ కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలాం, జిల్లా అధికారులతో కలిసి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం సభాస్థలిని పరిశీలించారు.

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను అధికారులతో చర్చించారు. సభా స్థలిని పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు.

సీఎం పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు సిపి వివరించారు.

సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే సత్యం తెలియజేశారు.

# కాంగ్రెస్ బోణీ.. 32వ వార్డు ఏకగ్రీవం

## -రెండోసారి కౌన్సిలర్‌గా గోదల మానస సాయిరాం



మెదక్, ఫిబ్రవరి 2:పురపోరులో కాంగ్రెస్ బోణీ చేసింది. మున్సిపల్ ఎన్నికల్లో అధికార ప్రతిపక్ష పార్టీలు వ్యూహప్రతివ్యూహాలు రచిస్తూ ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. సాధ్యమైనంత వరకు కౌన్సిలర్ స్థానాలను ఏకగ్రీవంగా ఎన్నుకునే విధంగా ప్రణాళికను రూపొందిస్తున్నారు. మెదక్ మున్సిపాల్టీలోని 32 వార్డును ఏకగ్రీవం చేశారు. మెదక్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలో మొత్తం 75 వార్డులకు గాను 415 నామినేషన్లు వచ్చాయి. మెదక్ మున్సిపాలిటిలో 32 వార్డులు ఉండగా, 32వ వార్డు నుంచి గోదల మానస సాయిరాం ఏకగ్రీవమయ్యారు. 32వ వార్డు లో కాంగ్రెస్ నుంచి గోదల మానస సాయిరాం నామినేషన్ వేసి బరిలో నిలువగా, బీఆర్ఎస్ నుంచి ప్రత్యర్థులు గోదల జ్యోతి బరిలో నిలిచారు. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు చొరవతో గోదల జ్యోతి తమ నామినేషన్ ను ఉపసంహరణకు అంగీకరించింది. దీంతో గోదల మానస సాయిరాం రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికకావడం జరిగింది.

# లుథియానాలోని హల్వారా ఎయిర్‌పోర్టులో టెర్మినల్ భవనాన్ని ప్రారంభించనున్న పీఎం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఫిబ్రవరి 1, 2026న పంజాబ్‌లో పర్యటించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 3:45 గంటలకు ఆదంపూర్ విమానాశ్రయాన్ని సందర్శించి, 'శ్రీ గురు రవిదాస్ జీ ఎయిర్‌పోర్టు, ఆదంపూర్'గా కొత్త పేరును ప్రధానమంత్రి ఆవిష్కరిస్తారు. లుథియానాలోని హల్వారా ఎయిర్‌పోర్టులో టెర్మినల్ భవనాన్ని కూడా ఆయన ప్రారంభిస్తారు.

సంత్ గురు రవిదాస్ జీ 649వ జయంతి సందర్భంగా ఆదంపూర్ విమానాశ్రయం పేరును మార్చడం ఆ మహనీయుడికి ఇచ్చే గౌరవం. సమానత్వం, కరుణ, వ్యక్తిత్వ గౌరవం పరంగా ఆయన చేసిన బోధనలు భారతదేశ సామాజిక విలువలకు నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటాయి.

పంజాబ్‌లో విమానయాన మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తూ, హల్వారా విమానాశ్రయంలో ప్రధానమంత్రి ప్రారంభించనున్న టెర్మినల్ భవనం రాష్ట్రానికి నూతన ద్వారంగా నిలవనుంది. ఇది లుథియానాతో పాటు పరిసర పారిశ్రామిక, వ్యవసాయ అనుబంధ ప్రాంతాల అవసరాలను తీరుస్తుంది. లుథియానాలోని హల్వారా భారత వైమానిక దళ స్థావరానికి వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన ప్రాంతం.

లుథియానాలోని పాత విమానాశ్రయం రన్‌వే చిన్నదిగా ఉండటంతో చిన్న విమానాలకు మాత్రమే అనుకూలంగా ఉండేది. ప్రయాణ సౌకర్యాలను మెరుగుపరిచేందుకు, పెద్ద విమానాల రాకపోకలకు వీలుగా హల్వారాలో పొడవైన రన్‌వేతో అభివృద్ధి చేసిన నూతన సివిల్ ఎన్‌క్లేవ్, ఏ320 వంటి పెద్ద విమానాలను తట్టుకోగల సామర్థ్యం గలది.

ప్రధానమంత్రి ఆకాంక్షించిన సుస్థిర, పర్యావరణ అనుకూల అభివృద్ధికి అనుగుణంగా, ఈ టెర్మినల్‌ను పర్యావరణహితమైన అంశాలతో అభివృద్ధి చేశారు. విద్యుత్ పొదుపు చేసేలా ఎల్ఈడీ లైటింగ్, ఇన్సులేటెడ్ రూఫింగ్, వర్షపు నీటి నిల్వ వ్యవస్థలు, మురుగునీటి, నీటి శుద్ధి ప్లాంట్లు నెలకొల్పారు. రీసైకిల్ చేసిన నీటిని మొక్కల పెంపకానికి వినియోగించేలా ఏర్పాట్లు చేశారు. ఈ నిర్మాణ శైలి పంజాబ్ సుసంపన్న సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రయాణికులకు ఆ ప్రాంత వైవిధ్యభరిత అనుభూతిని కలిగిస్తుంది.

# వ్యవస్థలు ఉండాలి..సజ్జల రామకృష్ణారెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 2: వ్యవస్థలు రాజకీయాలకు అతీతంగా ఉండాలని వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కానీ రాష్ట్రంలో అలాంటి వ్యవస్థలు లేకుండా చేస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు ఆగ్రహం కలిగిసున్నాయన్నారు. ఆర్గనైజ్డ్ క్రిమినల్స్ ఏరకంగా దాడులు చేశారో అంతా చూశారన్నారు. అలాంటి క్రిమినల్స్ కు పోలీసులు రక్షణగా నిలిచారన్నారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేద్దామంటే ఎవరూ అందుబాటులోకి రాలేదన్నారు. దాడి బాధితుడు అంబటి రాంబాబునే అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపారన్నారు.

రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు ఆగ్రహం కలిగిస్తున్నాయన్నారు. నియంతల తరహాలో అరాచకం సృష్టిస్తున్నారన్నారు. పోలీసులు చూస్తుండగానే దాడులకు పాల్పడుతున్నారన్నారు. జోగి రమేశ్ ఇంటికి వచ్చేందుకు ప్రయత్నించిన మా నేతలను అడ్డుకున్నారన్నారు. అసలు జోగి రమేశ్ ఇంటిపై దాడి చేసిన వారిలో ఎవరిపైనైనా కేసు పెట్టారా.. లోకేశ్ కు బుర్ర పాడైదంటే.. కేసులు పెడుతున్నారన్నారు. దీన్ని బట్టి వారి అసహనం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందన్నారు. భవిష్యత్తులో చంద్రబాబుగారు అన్నా కేసులు పెడతారేమోనని అన్నారు.

# సహకార సంఘాలను ప్రోత్సహించడానికి 2026–27 కేంద్ర బడ్జెటులో అనేక ప్రతిపాదనలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:ప్రాథమిక సహకార సంఘాలకు అనేక ప్రోత్సాహకాలను అందించాలని 2026–27 కేంద్ర బడ్జెటులో ప్రతిపాదించారు. సరఫరా చేయడానికి ఉద్దేశించిన పశువుల మేతనీ, పత్తి విత్తనాన్నీ ప్రాథమిక సహకార సంఘం సభ్యులు ఉత్పత్తి చేసినట్లయితే ఈ రెంటికీ కూడా డిడక్షన్ సదుపాయాన్ని విస్తరించాలని కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈ రోజు పార్లమెంటుకు సమర్పించిన బడ్జెటులో ప్రతిపాదించారు. ప్రస్తుతం ఈ డిడక్షన్‌ను పాలు, నూనెగింజలు, పండ్లు గానీ లేదా కాయగూరల సాగులో నిమగ్నమైన ప్రాథమిక సహకార సంఘాలకు ఇస్తున్నారు.

డివిడెండ్ రూపంలో ఆర్జించిన ఆదాయాన్ని సహకార సంఘాలు తమ సభ్యులకు పంపిణీ చేసిన పక్షంలో అలా పంచినంత మొత్తానికి కూడా డిడక్షన్‌ను అనుమతించాలని ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. జాతీయ సహకార సమాఖ్య లకు దన్నుగా నిలిచే మరొక అంశాన్నీ శ్రీమతి నిర్మలా సీతారామన్ ప్రకటించారు.. నోటిఫై చేసిన జాతీయ సహకార సమాఖ్య, 2026 జనవరి 1 లోపల కంపెనీల్లో పెట్టిన పెట్టుబడులపై డివిడెండ్ ఆదాయాన్ని అందు కొన్నట్లయితే అలాంటి ఆదాయానికి 3 సంవత్సరాల పాటు పన్ను మినహాయింపును ఇవ్వాలని కూడా మంత్రి ప్రతిపాదించారు. ఈ మినహాయింపును ఆయా సమాఖ్యలు తమ మెంబర్ కోఆపరేటివ్‌లకు పంచిపెట్టే డివిడెండ్లకు మాత్రమే ఇస్తారు.

# అరబ్ దేశాలతో భారత్‌కున్న బలమైన, చారిత్రక ప్రజా సంబంధాల గురించి వివరించిన ప్రధాని

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:భారత్‌లో జరుగుతున్న రెండో ఇండియా–అరబ్ విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరైన అరబ్ దేశాల విదేశాంగ మంత్రులు, లీగ్ ఆఫ్ అరబ్ దేశాల సెక్రటరీ జనరల్, అరబ్ ప్రతినిధి బృందాల నాయకులకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్వాగతం పలికారు.

అరబ్ దేశాలకు, భారత్‌కు మధ్య ఉన్న బలమైన, చారిత్రక ప్రజా సంబంధాల గురించి ప్రధానమంత్రి వివరించారు. ఇవి అనేక సంవత్సరాలుగా మన సంబంధాలకు స్ఫూర్తినిస్తూ.. బలోపేతం చేస్తున్నాయన్నారు.

భవిష్యత్తులో భారత్–అరబ్ భాగస్వామ్యం కోసం తన దార్శనికతను వివరించారు. ఉభయ పక్షాల ప్రజలకు పరస్పరం ప్రయోజనం కలిగేలా వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, సాంకేతికత, ఆరోగ్య సేవలు, ఇతర ప్రాధాన్య రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా భారత్ నిబద్ధతను పునరుద్ఘాటించారు. పాలస్తీనా ప్రజలకు భారత్ మద్దతు కొనసాగుతుందని ప్రధానమంత్రి స్పష్టం చేస్తూ.. గాజా శాంతి ప్రణాళికతో సహా కొనసాగుతున్న శాంతి ప్రయత్నాలను ప్రధాని స్వాగతించారు. ప్రాంతీయంగా శాంతి, స్థిరత్వం నెలకొల్పే దిశగా తోడ్పాటు అందించడంలో అరబ్ లీగ్ పోషిస్తున్న కీలకమైన పాత్రను ప్రశంసించారు.

# పట్నా పక్షుల అభయారణ్యం, ఛారీ-ధండ్‌లను రాంసర్ ప్రాంతాలుగా గుర్తించడాన్ని స్వాగతించిన ప్రధాని

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:ఎటా (ఉత్తరప్రదేశ్)లోని పట్నా పక్షుల అభయారణ్యాన్ని, కచ్ (గుజరాత్)లోని ఛారీ–ధండ్‌ను రాంసర్ ప్రాంతాలుగా గుర్తించడాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్వాగతించారు. స్థానికులకు, చిత్తడి నేలల సంరక్షణపై ఆసక్తి ఉన్నవారికి శ్రీ మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. జీవవైవిధ్యాన్ని కాపాడటంలో, కీలకమైన పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించడంలో తమ చిత్తశుద్ధిని ఈ గుర్తింపు పునరుద్ఘాటిస్తోందని పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమం ఎక్స్ లో కేంద్ర మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ పోస్టుకు ప్రధానమంత్రి స్పందిస్తూ "ఎటా (ఉత్తరప్రదేశ్)లోని పట్నా పక్షుల అభయారణ్యాన్ని, కచ్ (గుజరాత్)లోని ఛారీ–ధండ్‌ను రాంసర్ ప్రాంతాలుగా గుర్తించడం ఆనందదాయకం. అక్కడి స్థానికులకు, చిత్తడి నేలల పరిరక్షణపై ఆసక్తి ఉన్నవారికి శుభాకాంక్షలు. జీవవైవిధ్యాన్ని కాపాడటంలో, కీలకమైన పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించడంలో మా చిత్తశుద్ధిని ఈ గుర్తింపు పునరుద్ఘాటిస్తోంది. ఈ చిత్తడి నేలలు అనేక వలస, స్థానిక జీవ జాతులకు సురక్షితమైన ఆవాసాలుగా కొనసాగుతాయని ఆకాంక్షిస్తున్నాను."ఎటా (ఉత్తరప్రదేశ్)లోని పట్నా పక్షుల అభయారణ్యాన్ని, కచ్ (గుజరాత్)లోని ఛారీ–ధండ్‌ను రాంసర్ ప్రాంతాలుగా గుర్తించడాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్వాగతించారు. స్థానికులకు, చిత్తడి నేలల సంరక్షణపై ఆసక్తి ఉన్నవారికి శ్రీ మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. జీవవైవిధ్యాన్ని కాపాడటంలో, కీలకమైన పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించడంలో తమ చిత్తశుద్ధిని ఈ గుర్తింపు పునరుద్ఘాటిస్తోందని పేర్కొన్నారు.

"ఎటా (ఉత్తరప్రదేశ్)లోని పట్నా పక్షుల అభయారణ్యాన్ని, కచ్ (గుజరాత్)లోని ఛారీ–ధండ్‌ను రాంసర్ ప్రాంతాలుగా గుర్తించడం ఆనందదాయకం. అక్కడి స్థానికులకు, చిత్తడి నేలల పరిరక్షణపై ఆసక్తి ఉన్నవారికి శుభాకాంక్షలు. జీవవైవిధ్యాన్ని కాపాడటంలో, కీలకమైన పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించడంలో మా చిత్తశుద్ధిని ఈ గుర్తింపు పునరుద్ఘాటిస్తోంది.

# 7 వ్యూహాత్మక, అధునాతన రంగాల్లో తయారీని భారీగా పెంచడంపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కేంద్ర బడ్జెట్ 2026- 27

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:ఏడు వ్యూహాత్మక, అత్యాధునిక రంగాల్లో తయారీని భారీగా విస్తరించడంపై కేంద్ర బడ్జెట్ 2026–27 ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ ప్రతిపాదిత చర్యలన్నీ బడ్జెట్‌లోని 'ప్రథమ కర్తవ్యం' కింద ఉన్న ఆరు కీలక రంగాల్లో భాగమని.. పార్లమెంటులో బడ్జెట్ సమర్పణ సందర్భంగా కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

అంతర్జాతీయ బయోఫార్మా కేంద్రంగా భారత్‌ను నిలపడం లక్ష్యంగా.. రాబోయే అయిదేళ్ల కాలానికి రూ. 10,000 కోట్ల వ్యయంతో 'బయోఫార్మా శక్తి'ని బడ్జెట్ ప్రతిపాదించింది. జీవ ఔషధాలనూ, వాటితో సారూప్యమున్న ఔషధాలనూ (బయోసిమిలర్) దేశీయంగా ఉత్పత్తి చేసేందుకు సానుకూల వ్యవస్థను ఇది నిర్మిస్తుంది. బడ్జెటులో నిర్దేశించిన వ్యూహం మేరకు... 3 కొత్త జాతీయ ఔషధ విద్య, పరిశోధన సంస్థల (ఎన్ఐపీఈఆర్)తో బయోఫార్మాపై ప్రత్యేకంగా దృష్టి సారించేలా ఒక నెట్వర్కును ఏర్పాటు చేస్తారు. ఇదేకాకుండా ప్రస్తుతమున్న 7 సంస్థలను ఉన్నతీకరిస్తారు. 1000కి పైగా గుర్తింపు పొందిన భారత చికిత్సా ప్రయోగ కేంద్రాలతో నెట్వర్కును కూడా ఇది ఏర్పాటు చేస్తుంది. అంతర్జాతీయ ప్రమాణా లకు తగ్గట్టుగా కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థను బలోపేతం చేయాలనీ.. అలాగే ప్రత్యేక వైజ్ఞానిక సమీక్షా సిబ్బంది, వృత్తి నిపుణుల ద్వారా అనుమతుల ప్రక్రియలో జాప్యాన్ని తగ్గించాలనీ కేంద్ర బడ్జెట్ ప్రతిపాదించింది.

భారత సెమికండక్టర్ రంగ సామర్థ్యాలను విస్తరించడానికీ, ఇండియా సెమికండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) 1.0 సాధించిన విజయాలను ముందుకు తీసుకెళడానికీ.. ఐఎస్ఎం 2.0ను ప్రారంభించాలని కేంద్ర బడ్జెట్ ప్రతిపాదించింది. తద్వారా పరికరాలు, అవసరమైన పదార్థాల ఉత్పత్తి, భారతీయ మేధో సంపత్తిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడం, సరఫరా వ్యవస్థల బలోపేతంపై దృష్టి సారించాలని నిర్ణయించింది. సంబంధిత పారిశ్రామిక నేతృత్వంలో పరిశోధన, శిక్షణ కేంద్రాలపై దృష్టి సారించడం ద్వారా సాంకేతికతనూ, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తినీ అభివృద్ధి చేస్తామని శ్రీమతి నిర్మలా సీతారామన్ చెప్పారు.

2025 ఏప్రిల్ లో ప్రారంభించిన ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీ పథకం కోసం రూ. 22,919 కోట్లు వెచ్చించారు. కాగా, దీనికి మరింత ఊతమిచ్చి, ముందుకు తీసుకెళ్లేలా.. కేటాయింపులను రూ. 40,000 కోట్లకు పెంచాలని 2026–27 కేంద్ర బడ్జెట్ ప్రతిపాదించింది.

అరుదైన ఖనిజాలతో రూపొందించే శాశ్వత అయస్కాంతాలపై పథకానికి సంబంధించి.. ఖనిజ సంపద ఉన్న ఒడిషా, కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చేయూతనివ్వాలని కేంద్ర బడ్జెట్ ప్రతిపాదించింది. మైనింగ్, శుద్ధి, పరిశోధన, తయారీలను ప్రోత్సహించే లక్ష్యంతో ఆ రాష్ట్రాల్లో ప్రత్యేక రేర్ ఎర్త్ కారిడార్ల ఏర్పాటుకు సహకరించాలని నిర్ణయించింది.

దేశీయంగా రసాయనాల ఉత్పత్తిని మెరుగుపరచడంతోపాటు దిగుమతులపై ఆధీనతను తగ్గించడం కోసం.. 3 ప్రత్యేక కెమికల్ పార్కుల ఏర్పాటు దిశగా రాష్ట్రాలకు సహకరించేలా ఓ పథకాన్ని ప్రారంభించాలని కేంద్ర మంత్రి ప్రతిపాదించారు. క్లస్టర్ ప్రాతిపదికగా నిర్వహణ సన్నద్ధంగా ఉన్న సదుపాయాలతో.. అమలు ఆధారంగా రాష్ట్రాలకు నిధుల కేటాయింపు విధానం (చాలెంజ్ రూట్)లో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

వివిధ రంగాల్లో ఉత్పాదకతనూ, నాణ్యతనూ నిర్ణయించడంలో బలమైన మూలధన వస్తువుల సమర్థత కీలకమైనదని బడ్జెట్ ప్రసంగంలో శ్రీమతి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

ఈ సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా సీపీఎస్ఈల ఆధ్వర్యంలో రెండు చోట్ల హై టెక్ టూల్ రూంలను ఏర్పాటు చేయాలని కేంద్ర బడ్జెట్ ప్రతిపాదించింది. డిజిటల్ సదుపాయాలు కలిగిన ఆటోమేటెడ్ సర్వీస్ బ్యూరోలుగా ఇవి పనిచేస్తాయి. అత్యంత కచ్చితత్వంతో కూడిన విడిభాగాలను స్థానికంగానే రూపొందించడానికి, పరీక్షించడానికి, తక్కువ ఖర్చుతోనే భారీ స్థాయిలో ఉత్పత్తి చేయడానికి ఇవి ఉపయోగపడతాయి. అత్యంత విలువైన, సాంకేతికంగా పురోగతి చెందిన నిర్మాణ, మౌలిక సదుపాయాల పరికరాల (సీఐఈ) దేశీయ తయారీని బలోపేతం చేయడం కోసం ఒక ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్టు బడ్జెట్ తెలిపింది. ఈ పరికరాల్లో బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్‌లలో ఉండే లిఫ్టుల నుంచి చిన్న – భారీ అగ్నిమాపక పరికరాల వరకు.. అలాగే మెట్రోలు, ఎత్తైన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి ఉపయోగించే భారీ టన్నెల్ బోరింగ్ యంత్రాల వరకు ఉంటాయి. అయిదేళ్ల కాలానికి రూ. 10,000 కోట్ల బడ్జెట్ కేటాయింపుతో కంటైనర్ల తయారీ కోసం కూడా ఒక పథకాన్ని బడ్జెట్ ప్రతిపాదించింది. ప్రపంచ స్థాయిలో పోటీపడేలా కంటైనర్ల తయారీ వ్యవస్థను రూపొందించడం దీని లక్ష్యం.

కార్మికులు ఎక్కువగా ఉండే జౌళి రంగం కోసం 5 ఉప విభాగాలతో కూడిన ఓ సమీకృత కార్యక్రమాన్ని బడ్జెట్ ప్రతిపాదించింది.

మొదటిది– పట్టు, ఉన్ని, జనపనార వంటి సహజ ఫైబర్ రకాలతోపాటు కృత్రిమ, కొత్త తరహా ఫైబర్ రకాల్లో స్వావలంబన సాధించడం కోసం 'నేషనల్ ఫైబర్ స్కీం'. రెండోది– సంప్రదాయ జౌళి క్లస్టర్ల ఆధునికీకరణ కోసం టెక్స్‌టైల్ విస్తరణ, ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టడం.. దీని ద్వారా యంత్రాల కొనుగోలుకు మూలధన సాయం, సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి, ఉమ్మడి పరీక్ష, ధ్రువీకరణ కేంద్రాల ఏర్పాటుకు నిధులు సమకూరుస్తారు. మూడోది – ప్రస్తుతమున్న వివిధ పథకాలను ఏకీకృతమూ, బలోపేతమూ చేస్తూ.. నేత కార్మికులకు, హస్తకళాకారులకు నిర్దేశిత మద్దతును అందించడం కోసం 'జాతీయ చేనేత, హస్తకళా కార్యక్రమా'న్ని ప్రారంభించడం. నాలుగోది– ప్రపంచ స్థాయిలో పోటీ పడగలిగేలా, పర్యావరణ హితంగా జౌళి, వస్త్రోత్పత్తిని ప్రోత్సహించడం కోసం టెక్స్–ఎకో కార్యక్రమం. అయిదోది– సంబంధిత పరిశ్రమ, విద్యా సంస్థల సహకారంతో జౌళీ రంగంలో నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను ఆధునికీకరించడం, ఉన్నతీకరించడం కోసం 'సమర్థ్ 2.0' కార్యక్రమం.

ప్రత్యేక అవసరాల కోసం తయారు చేసే వస్త్రాల (టెక్నికల్ టెక్స్‌టైల్స్) విషయంలో.. వాటి ఉత్పాదక విలువను పెంచడంపై దృష్టి సారిస్తూ, పనితీరును బట్టి నిధుల కేటాయింపు పద్ధతిలో (ఛాలెంజ్ మోడ్) టెక్స్‌టైల్ పార్కులను ఏర్పాటు చేయాలని కేంద్ర బడ్జెట్ ప్రతిపాదించింది.

వీటితోపాటు ఖాదీ, చేనేత, హస్తకళలను బలోపేతం చేసేలా 'మహాత్మాగాంధీ గ్రామ స్వరాజ్' కార్యక్రమాన్నీ ప్రారంభించాలని కేంద్ర బడ్జెట్ ప్రతిపాదించింది. అంతర్జాతీయ విపణితో అనుసంధానానికీ, బ్రాండింగుకూ ఇది ఎంతగానో దోహదపడుతుంది. శిక్షణ, నైపుణ్యాభివృద్ధితోపాటు ప్రక్రియావరమైన, ఉత్పత్తి నాణ్యతను మెరుగుపరచి, క్రమబద్ధీకరించడానికి బడ్జెట్ ప్రత్యేక ప్రాధాన్యమిచ్చింది. దీనివల్ల మన నేత కార్మికులు, గ్రామీణ పరిశ్రమలు, 'ఒక జిల్లా– ఒక ఉత్పత్తి' కార్యక్రమాలతోపాటు గ్రామీణ యువతకు లబ్ధి కలుగుతుందని బడ్జెట్ పేర్కొన్నది.

అందుబాటు ధరల్లోనే అత్యుత్తమ క్రీడా వస్తువుల ఉత్పత్తికి అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగే సామర్థ్యం భారత్‌కు ఉందని బడ్జెట్ ప్రసంగం సందర్భంగా శ్రీమతి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఈ దిశగా క్రీడా పరికరాల కోసం ప్రత్యేకంగా ఓ కార్యక్రమాన్ని బడ్జెట్ ప్రతిపాదించింది. ఇది క్రీడా వస్తువుల తయారీ, పరిశోధన, పరికరాల రూపకల్పనలో ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది. అలాగే మెటీరియల్ సైన్సెస్ [illegible] దోహదపడుతుంది.

# 15వ వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

## -బీజేపీ అభ్యర్థి కుక్కల విజయ్ కుమార్

పరకాల, ఫిబ్రవరి 2: పరకాల పట్టణంలోని 15వ వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని 15వ వార్డులో బీజేపీ బలపరిచిన కుక్కల విజయ్ కుమార్ యకుమార్ ఇంటింటికి తిరుగుతూ బీజేపీ అభ్యర్థిగా తనను గెలించడానికి కమలం పువ్వు పోటీలో ఉన్నట్టు పేర్కొన్నారు. కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు,



ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ రోజు పట్టణంలోని 15వ వార్డులో కూరగాయల మార్కెట్ ప్రాంతంలో ఇంటింటి విస్తృత ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అభ్యర్థి కుక్కల విజ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అవినీతి కి ఆస్కారం లేకుండా ప్రజలకు పనులు చేసి పెడుతానని హామీ ఇచ్చారు. ప్రజలకు సేవ చేసేందుకే మున్సిపల్ కౌన్సిలర్‌గా బీజేపీ బలపరిచిన అభ్యర్థిగా అవినీతి లేకుండా అభివృద్ధి చెందుతున్న దేశాన్ని చూసి బీజేపీ కమలం (పువ్వు) గుర్తుకు ఓటు వేయాలని వేడుకున్నారు. అభ్యర్థి విజయ్ కుమార్ వెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహణ

వరంగల్,ఫిబ్రవరి 2:విద్యార్థులలోని విజ్ఞానాన్ని మరింత పెంపొందించడం కోసం టాలెంట్ టెస్టులు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూక్యా హేమంత్ అన్నారు. సోమవారం యాకుబ్ పురలోని పాఠశాలలో వరంగల్ జిల్లా సోషల్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిదిగా హాజరై ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.

ఈ సందర్భం గా ఆయన మట్లాడుతూ టాలెంట్ టెస్టుల ద్వారా విద్యార్థుల్లోని విజనాన్ని పెంచుకోవడానికి మంచి అవకాశం దొరికినట్లు అవుతుందని అన్నారు.

తక్కువ సమయంలో ఎక్కువ ప్రశ్నలకు సమాధానం చేయడం ద్వారా భవిష్యత్తు పరీక్షల్లో ఎలాంటి తడబాటు లేకుండా ఉంటుందని అన్నారు.

తెలుగు విభాగంలో ప్రథమ బహుమతి విజేత ఎండీ షకీరా (జిల్లా పరిషత్ హై స్కూల్ రాయపర్తి), ద్వితీయ బహుమతి పి.ప్రణీత్ (జిల్లా పరిషత్ హై స్కూల్ కొత్తూరు), తృతీయ బహుమతి ఎస్కే. ఇమ్రాన్ (జిల్లా పరిషత్ హై స్కూల్, చెన్నారం) ఇంగ్లీష్ విభాగంలో మొదటి విజేతగా హాసినీ (టీఎస్ఆర్ఎస్, నెక్కొండ), ద్వితీయ విజేత ఎండీ ముదాసిర్ (కిష్టకాలనీ ప్రభుత్వ పాఠశాల, వరంగల్), తృతీయ విజేతగా బి. వినయ్ (జిల్లా పరిషత్ హై స్కూల్ లింగాపురం) విజేతలుగా నిలిచారు.

# భారత్ పర్వ్ 2026లో అద్భుత కూచిపూడి నృత్య ప్రదర్శనతో వైభవంగా జరిగిన ఆంధ్రప్రదేశ్ దినోత్సవం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:చారిత్రక ఎర్రకోట వద్ద జరిగిన 'భారత్ పర్వ్ 2026'లో భాగంగా 30 జనవరి 2026న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దినోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలు రాష్ట్ర సుసంపన్న సాంస్కృతిక, కళాత్మక, పర్యాటక వారసత్వాన్ని అద్భుతంగా ప్రదర్శించాయి.

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ నిర్వహించే భారత్ పర్వ్.. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సంస్కృతి, పర్యాటకం, ఆహారపు అలవాట్లు, చేనేత వస్త్రాలు, వారసత్వ సంపదను ప్రతిబింబిస్తుంది. దీన్ని ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ స్ఫూర్తితో నిర్వహిస్తారు.

ప్రధాన ఆకర్షణగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ పెవిలియన్.. పర్యాటక రంగ ఇతివృత్తంతో కూడిన ప్రదర్శనలు, సంప్రదాయ ఫుడ్ కోర్టు, అద్భుతమైన చేనేత ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకుంది. రాష్ట్ర చారిత్రక వారసత్వం, కళా సంప్రదాయాలు, సృజనాత్మక నైపుణ్యాలను ప్రతిబింబించేలా ఈ ప్రదర్శనశాల సందర్శకులకు గొప్ప అనుభూతిని కలిగించింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో 46 మంది ప్రముఖ కళాకారులతో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ నృత్య రీతిలోని లాలిత్యం, గాంభీర్యం, ఆధ్యాత్మిక లోతును కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న ఈ ప్రదర్శన, రాష్ట్ర సాంస్కృతిక విలువలను, శాస్త్రీయ కళారూపాలను పరిరక్షించటంలోని ప్రాధాన్యతను ప్రతిబింబించింది.

భారతీయ సంస్కృతిని అభిమానించేవారు, పర్యాటకులు, సందర్శకులు భారీగా ఈ వేడుకకు హాజరై కళాకారులను ఉత్సాహపరుస్తూ ఈ ప్రతిష్ఠాత్మక జాతీయ వేదికపై ఆంధ్రప్రదేశ్ గర్వించేలా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

'భారత్ పర్వ్ 2026'లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వేడుకలు, భారతదేశ సాంస్కృతిక వైవిధ్యానికి, ఐక్యతకు ప్రతీకగా నిలిచాయి. సాంస్కృతిక మార్పిడి, జాతీయ సమగ్రతను పెంపొందించటంలో ఈ ఉత్సవ పాత్రను ఈ వేడుకలు మరింత బలపరిచాయి.

# తప్పు చేసిన ప్రతి ఒక్కరిని చట్టపరంగా శిక్షిస్తాం : చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 2:ఏపీలో అలజడి సృష్టించి శాంతి భద్రతలకు భంగం కలిగించేందుకు వైసీపీ ప్రజలను రెచ్చ గొట్టే చర్యలకు దిగుతుందని సీఎం చంద్రబాబు నాయుడు ఆరోపించారు. టీడీపీ శ్రేణులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండి సంయమనం పాటించాలని సూచించారు.

రాష్ట్రంలో ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలపై సోమవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల టీడీపీ నాయకులతో మాట్లాడారు. రాష్ట్రంలో తప్పులు చేసిన వారిని చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన వైసీపీ నాయకులు కల్తీ జరుగలేదని ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, మంత్రులు, నాయకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. హింస, విధ్వంసం, అవినీతి ధ్యేయంగా ఆవిర్భవి ంచిన వైసీపీ ట్రాప్‌లో పడోద్దని హితవు పలికారు. రాష్ట్ర అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమిపై అనవసర విషయాల్లో అవాస్తవా లను ప్రచారం చేస్తుందని ఆరోపించారు. పెట్టుబడులు సాధించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే ధ్యేయమని అన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో మంత్రులు పాల్గొన్నారు.

# ఉమీద్ కేంద్ర పోర్టల్‌లో సర్వే, వక్ఫ్ ప్రాపర్టీ లీజు పేరుతో రెండు కొత్త మాడ్యూళ్లను ప్రారంభించిన మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:ఏకీకృత వక్ఫ్ నిర్వహణ, సాధికారత, సామర్థ్యం, అభివృద్ధి (ఉమీద్) కేంద్ర పోర్టల్ ద్వారా పారదర్శకమైన, ప్రజానుకూలమైన, జవాబుదారీతనంతో కూడిన వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిరంతర ప్రయత్నాలను చేపడుతోంది. దీనిలో భాగంగా.. ఈ పోర్టల్లో సర్వే, వక్ఫ్ ప్రాపర్టీ లీజు పేరుతో రెండు అదనపు మాడ్యూళ్లను 2026 జనవరి 30న ప్రారంభించింది.

మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్ కుమార్ ఈ కొత్త మాడ్యూళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల సర్వేకు సంబంధించిన సమాచార సేకరణ, నిర్వహణ, నవీకరణల కోసం అవసరమైన సమగ్ర డిజిటల్ విధానాన్ని పోర్టల్లోని సర్వే మాడ్యూల్ అందిస్తుంది.

పోర్టల్ ద్వారా వక్ఫ్ ఆస్తుల లీజుకు సంబంధించిన మొత్తం సమాచార నిర్వహణను సులభతరం చేయడానికి వక్ఫ్ ప్రాపర్టీ లీజ్ మేనేజ్మెంట్ మాడ్యూల్ రూపుదిద్దుకుంది. ఇది లీజు సమాచారం, లీజు వ్యవధి, లీజు మొత్తం, తదితర ముఖ్యమైన వివరాలను నిర్మాణాత్మకంగా, పారదర్శకంగా నమోదు చేయడానికి, పర్యవేక్షించడానికి వీలు కల్పిస్తుంది.



తద్వారా వక్ఫ్ ఆస్తుల లీజు విధానంలో జవాబుదారీతనాన్ని, పర్యవేక్షణను బలోపేతం చేస్తుంది.

వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో సామర్థ్యాన్ని, పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి డిజిటల్ పాలనా పద్ధతులను ఉపయోగించు కొనేందుకు మంత్రిత్వ శాఖ చేపడుతున్న నిరంతర ప్రయత్నా లను ఈ ప్రారంభం ప్రతిబిం బిస్తుంది.

ఈ మాడ్యూళ్లను విస్తృతంగా అమలయ్యేలా చూడాలని, అర్హులైన లబ్ధిదారుల్లో అవగాహనను పెంపొందించాలని అన్ని రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల వక్ఫ్ బోర్డులకు డాక్టర్ చంద్ర శేఖర్ కుమార్ సూచించారు.

ఉమీద్ కేంద్ర పోర్టల్‌ను కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ కిరెణ్ రిజిజు 2025 జూన్ 6న ప్రారంభించారు. ఇది ఏకీకృత వక్ఫ్ నిర్వహణ, సాధికారత, సామర్థ్యం, అభివృద్ధి చట్టం - 1995 ప్రకారం వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేసే, ధ్రువీకరించే, పర్యవేక్షించే డిజిటల్ వేదికగా పనిచేస్తుంది.

విస్తృతమైన పారదర్శకతను, జవాబుదారీతనాన్ని, ప్రజా భాగస్వామ్యాన్ని ప్రవేశపెట్టడం ద్వారా దేశవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో ప్రాథమిక మార్పును తీసుకురావడమే ఈ పోర్టల్ లక్ష్యం.

అన్ని వక్ఫ్ ఆస్తులకు జియో ట్యాగింగ్ ద్వారా సమగ్ర డిజిటల్ జాబితాను రూపొందించడం, సకాలంలో, సమర్థంగా ప్రతిస్పందనను అందించేలా ఆన్లైన్ ఫిర్యాదు పరిష్కార యంత్రాంగం, పారదర్శకమైన లీజు, వినియోగ ట్రాకింగు, జీఐఎస్ మ్యాపింగ్ ఏకీకరణ, ఇతర ఈ-గవర్నెన్స్ సాధనాలు, ఇతర ముఖ్యమైన ఫీచర్లు దీనిలో ఉన్నాయి. అలాగే ధ్రువీకరించిన రికార్డులు, నివేదికలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి.

దేశవ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తుల నిర్వహణను సమర్థంగా చేపట్టేందుకు అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కలసి పనిచేస్తోంది.

# అసంఘటితరంగ కార్మికులకు రక్త పరీక్షలు



ఖమ్మం, ఫిబ్రవరి 2: భవన నిర్మాణ, ఇతర అసంఘటిత రంగ కార్మికులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం చుంచుపల్లి మండలం రుద్రంపూర్ పంచాయతీలో నిర్వహించారు. ఇందులో భాగంగా కామన్ సర్వీస్ సెంటర్ (సిఎస్‌సి) హెల్త్ కేర్ ఆధ్వర్యంలో లేబర్ కార్డు కలిగిన నిర్మాణ రంగ కార్మికులకు 50 రకాల వైద్య పరీక్షలు ఉచితంగానే చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్మిక సంక్షేమ శాఖ జారీ చేసిన లేబర్ కార్డు ఉన్నవారు పరీక్షలు చేయించుకునేందుకు అర్హులని తెలిపారు. కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య పరీక్షలకు వచ్చేటప్పుడు లేబర్ కార్డుతో పాటు ఆధార్ కార్డు వెంట తీసుకుని రావాలన్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు కూలీ పని, తాపీ మేస్త్రీ, ప్లంబర్, టైల్స్, పాల్ సీలింగ్, ఎలక్ట్రిషన్, కార్పెంటర్, పేయింటర్స్, బ్రిక్స్ వర్కర్స్, గ్లాస్ వర్కర్స్ తదితర కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు.

ముఖ్యంగా ఆధునిక ఆరోగ్య పరీక్షలు బిపి, షుగర్, థైరాయిడ్, హెచ్‌డిఏ, బ్లడ్, మిటమిన్ డి, ఈసిజి, హైపటైటీస్ బి, సి, పిఎఫ్‌టి, ఊపిరితిత్తుల పరీక్షలు, కాన్సర్, ఎయిడ్స్ వంటి వ్యాధులకు పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. పరీక్షలు చేయించుకున్న పది రోజుల్లోపే కార్మికుల రిపోర్ట్‌లను మాన్యువల్‌గా వారికి అందించి ఆరోగ్య పరిస్థితిని వివరించనున్నట్లు చెప్పారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి ప్రభుత్వ దవాఖానల్లో వైద్యం అందించే ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. వైద్య శిబిరాల్లో పరీక్షలు చేయించుకున్న కార్మికులకు తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి పేరుతో ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన హెల్త్ స్క్రీనింగ్ కార్డులు ఇవ్వడంతో పాటు ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని సూపర్‌వైజర్ ప్రవీణ్ తెలిపారు. నేడు 25 మందికి రక్త పరీక్షలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ మహేష్, ల్యాబ్ టెక్నీషియన్ సంధ్య, సర్పంచ్ బానోత్ కేస్లీ, ఉప సర్పంచ్ తోటరాజు, భవన నిర్మాణ సంఘం నాయకుడు రాములు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : పాకాల నాగలక్ష్మి




వరంగల్, ఫిబ్రవరి 2:గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారంకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని జనగామ జిల్లా ఆలీంపూర్ గ్రామ సర్పంచ్ పాకాల నాగలక్ష్మి అన్నారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో వార్డు సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలిసి ఆమె మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వార్డులకు ప్రతి రోజు తాగునీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది ఆయా వార్డులకు వెళ్లినప్పుడు పరిసరాలు పరిశుభ్రం చేసి సంబంధిత వార్డు సభ్యుడి సంతకం తీసుకోవాలన్నారు.

సిబ్బంది ఆయా వార్డులకు వెళ్లినప్పుడు పరిసరాలు పరిశుభ్రం చేసి సంబంధిత వార్డు సభ్యుడి సంతకం తీసుకోవాలన్నారు. వీధి దీపాలు ఎక్కడ వెలగడం లేదో పంచాయతీకి సమాచారం అందించాలన్నారు. అంతే కాకుండా గ్రామంలో వాటర్‌ప్లాంట్ నడిపించే విధంగా కృషి చేస్తామన్నారు. ఇందుకుగాను త్వరలో గ్రామసభ ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా వార్డుల్లో చెడిపోయిన బోరు మోటర్లను మరమ్మతు చేయిస్తామని అన్నారు. ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకూడదన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మామిడాల ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి బాల్నె రేవతిగౌడ్, కారోబార్ మురళి, పంచాయతీ వార్డు సభ్యులు పోతుగంటి స్రవంతి, పర్వతం ఉప్పలయ్య, గందమల్ల నవనీత, పాకాల మధు, పాకాల బాలక్రిష్ణ, ఎలికట్టె గణేశ్, రాగీరు కుమారస్వామి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# నర్సరీలో నాటిన మొక్కలను సంరక్షించాలి : ఎంపీడీవో

ఆదిలాబాద్, ఫిబ్రవరి 2:నర్సరీలో నాటిన మొక్కలను సంరక్షించాలని జై నూరు మండల ఎంపీడీవో సుధాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని పానాపటార్ గ్రామపంచాయతీలో సోమవారం ఆయన పలు నర్సరీలను సందర్శించి సూచనలు చేశారు. వాతావరణ సమతుల్యతకు మొక్కలు నాటడం ఎంతో అవసరమని అన్నారు. నర్సరీలో ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ మొక్కలు ఎదిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం పీఎంఏవై ఇండ్ల నిర్మాణం త్వరలో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను కోరారు. గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఎంపీవో బి.మోహన్, సర్పంచ్ ఆత్రం తులసి శంకర్ కోలం, పంచాయతీ కార్యదర్శి జాడీ కైలాస్, గ్రామస్థులు ఆత్రం భలేరావు, లక్ష్మణ్ వినాయకరావు, భీమ్‌రావు, రాంశావ్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం తపిస్తున్న బడ్జెటిది..దేశ ప్రజల ఆకాంక్షల్ని నెరవేరుస్తుంది: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: 2026 కేంద్ర బడ్జెటుపై ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన అభిప్రాయాల్ని ఈ రోజు వీడియో సందేశంలో ప్రజలతో పంచుకున్నారు. ఇవాళ్టి బడ్జెటు చరిత్రాత్మకమైందనీ, దేశ మహిళల సాధికార భావనకు ఇది అద్దం పడుతోందనీ వర్ణించారు. కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ మహిళా ఆర్థిక మంత్రిగా వరుసగా తొమ్మిదో సారి దేశ బడ్జెటును ప్రవేశపెట్టి, రికార్డును నెలకొల్పారని ఆయన చెప్పారు. అనేక అవకాశాలకు రాచబాటను వేసింది ఈ బడ్జెటు..ఇది భారత వర్తమాన కలల్ని నెరవేర్చడంతో పాటు, ఉజ్వల భవితకు బలమైన పునాదిని కూడా వేస్తుందని ప్రధానమంత్రి తెలిపారు. 2047 కల్లా అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు భారత్‌కు ఈ బడ్జెటు రెక్కలు తొడుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

భారత్‌లో ప్రస్తుతం సంస్కరణల ఎక్స్‌ప్రెస్ పరుగులు తీస్తోందనీ, ఈ బడ్జెటుతో ఈ ఎక్స్‌ప్రెస్ ఒక కొత్త శక్తినే కాకుండా ఓ కొత్త జోరును కూడా అందుకొంటుందని శ్రీ మోదీ వెల్లడించారు. ఇంతవరకు చేపట్టనటువంటి సంస్కరణల్ని చేపట్టినందువల్ల, భారత్‌లో వృద్ధి లోకి రావాలని తపించిపోతున్న, ధైర్యవంతులైన, ప్రతిభావంతులైన యువతకు వారు ఉవ్వెత్తున ఎగరడానికి విశాల గగనాన్ని బడ్జెటు వారి ఎదుట ఆవిష్కరించిందని ఆయన అన్నారు. నమ్మకమైన పాలన, దేశ పౌరుల ప్రయోజనాలకు ప్రాముఖ్యాన్నిచ్చే ఆర్థిక ప్రణాళిక.. ఈ రెండు దృష్టికోణాలనూ బడ్జెటు సాకారం చేసిందని కూడా ఆయన చెప్పారు. ద్రవ్య లోటును తగ్గించడం, ధరల పెరుగుదలకు కళ్లెం వేయడం, అదే సమయంలో అధిక మూలధన వ్యయానికీ, అధిక అభివృద్ధికీ పూచీని ఇవ్వడం.. వీటిపై దృష్టిని కేంద్రీకరించిన అద్వితీయ బడ్జెటు ఇదని ప్రధాన మంత్రి ఉద్ఘాటించారు.

భారత్ ప్రపంచంలో పోషించాల్సిన సరికొత్త పాత్రకు ఈ బడ్జెటు దన్నుగా నిలుస్తుందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థతోనే భారత్‌లోని 140 కోట్ల మంది పౌరులు సంతృప్తి చెందడం లేదనీ, త్వరలో ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలని దేశ ప్రజలు దృఢంగా తీర్మానించుకొన్నారనీ ఆయన స్పష్టం చేశారు. ఇది లక్షలాది భారతీయుల ఉమ్మడి సంకల్పమని ఆయన అన్నారు. నమ్మదగ్గ ప్రజాస్వామ్య భాగస్వామిగానూ, మంచి నాణ్యత కల వస్తుసేవల సరఫరాదారు దేశంగానూ భారత్ భూమిక అంతకంతకూ విస్తరిస్తోందని ప్రధాని వెల్లడించారు. భారత్ ఇటీవల కుదుర్చుకున్న ప్రధాన వాణిజ్య ఒప్పందాల లక్ష్యం దేశ యువతకూ, చిన్న మధ్యతరహా వాణిజ్య సంస్థలకూ గరిష్ఠ ప్రయోజనాల్ని అందించా లన్నదేననీ, ఆ దిశగా ముందు ముందుకు సాగిపోవడానికి ఈ బడ్జెటులో ముఖ్య నిర్ణయాలు తీసుకొన్నారనీ ఆయన వివరించారు.

మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ ఉద్యమాలకు మరింత జోరును అందించడానికి బడ్జెటు రాజమార్గాన్ని పరిచిందని శ్రీ మోదీ స్పష్టం చేశారు. గొప్పగా రాణించడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్న రంగాలకు ఇదివరకు ఎన్నడూ ఎరుగనంత మద్దతును ఇవ్వడమైందనీ, వాటిలో బయోఫార్మా శక్తి మిషన్, సెమికండక్టర్ మిషన్ 2.0లతో పాటు ఎలక్ట్రానిక్ కాంపొనెంట్ మాన్యుఫాక్చరింగ్ స్కీము, రేర్ ఎర్త్ కారిడార్‌కు రూపకల్పన, కీలక ఖనిజాల రంగాన్ని పటిష్ఠం చేయడం, వస్త్ర రంగంలో కొత్త పథకాలు, ఉన్నత సాంకేతికతను కలిగి ఉండే సాధనాల తయారీకి ప్రోత్సాహాన్ని ఇవ్వడం, దేశ వర్తమాన, భావి కాల అవసరాలను తీర్చగలిగేలా మెరికల్లాంటి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వాణిజ్య సంస్థల (ఎమ్ఎస్ ఎమఈస్)ను తీర్చిదిద్దడం వంటివి కొన్ననీ శ్రీ మోదీ వివరించారు. చిన్న, కుటీర పరిశ్రమలు సహా ఎమ్ఎస్ఎమఈలకు అందిస్తున్న మద్దతుతో ఆయా సంస్థలు స్థానిక అవసరాలను తీర్చడమే కాక ప్రపంచ దేశాలతో సై అంటే సై అని పోటీపడగల స్తోమతను సమకూరుస్తాయని ప్రధానమంత్రి వర్ణించారు.

మౌలిక సదుపాయాల కల్పనను బలపరిచేందుకు బడ్జెటులో అనేక ప్రధాన నిర్ణయాలు ఉన్నాయని కూడా శ్రీ మోదీ తెలిపారు. వాటిలో అచ్చంగా సరుకుల రవాణాకే కేటాయించిన కారిడార్, దేశవ్యాప్తంగా జలమార్గాల విస్తరణ, హై-స్పీడ్ రైల్ కారిడార్, 2వ అంచె 3వ అంచె నగరాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధతో పాటు నగరాలకు బలమైన ఆర్థిక పునాదిని వేసే దృష్టితో మ్యునిసిపల్ బాండ్లను ప్రోత్సహించడం వంటి నిర్ణయాలు కలిసి ఉన్నాయన్నారు. ఈ చర్యలన్నీ వికసిత్ భారత్ దిశగా పయనాన్ని వేగవంతం చేసేవేనని ఆయన ఉద్ఘాటించారు.

ఏ దేశానికైనా ఆ దేశ పౌరులే అతి గొప్ప పెట్టుబడి వనరు అని ప్రధానమంత్రి వర్ణించారు. ఇటీవల కొన్నేళ్లుగా ప్రభుత్వం, పౌరుల సామర్థ్యాలను పెంపొందించడానికి ఇదివరకు ఎప్పుడూ లేనంత స్థాయిలో పెట్టుబడులు పెట్టిందని ఆయన గుర్తుచేశారు. ఇది యువజనులకు శక్తినిచ్చే బడ్జెటన్న కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ మాటల్ని ప్రధాని శ్రీ మోదీ పునరుద్ఘాటిస్తూ, బడ్జెటులో పొందుపరిచిన ప్రతిపాదనలు వివిధ రంగాల్లో నాయకుల్నీ, నూతన ఆవిష్కర్తల్నీ, సృజనకారుల్నీ తీర్చిదిద్దుతాయని స్పష్టం చేశారు. వైద్య కూడళ్లు, ఆరోగ్య రంగ సంబంధిత వృత్తినిపుణులకు తోడ్పాటు, సృజన ప్రధాన ఆర్థిక వ్యవస్థకు ప్రోత్సాహాన్ని ఇవ్వడం, గేమింగ్, పర్యటన రంగాలతో పాటు ఖేలో ఇండియాకు దన్నుగా నిలవడం.. ఇవన్నీ యువతీయువకులకు కొత్త కొత్త అవకాశాల్ని అందిస్తాయని ఆయన తెలిపారు. భారత్‌ను ప్రపంచానికి డేటా సెంటర్ కూడలిగా నిలబెట్టడానికి ఒక ప్రధానమైన పన్ను రాయితీని ప్రకటించిన సంగతిని ప్రధాని ప్రస్తావించారు.

యువతకు విశేష అభినందనల్ని అందజేస్తూ, ఉపాధికల్పనకు ఈ బడ్జెటు గొప్ప ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. పర్యటన రంగాన్ని..ముఖ్యంగా దేశ ఈశాన్య రాష్ట్రాల్లో పర్యటన అవకాశాల్ని ప్రోత్సహించడానికి నిర్దిష్ట చర్యలు తీసుకున్నారనీ, వివిధ రాష్ట్రాలకు సాధికారతను కల్పిస్తూ సమతౌల్య అభివృద్ధి సాధన యత్నాలను బలపరుస్తుండడం హర్షణీయమనీ ప్రధానమంత్రి అన్నారు.

స్వయంసహాయ బృందాలతో 10 కోట్ల మంది కన్నా ఎక్కువ మంది మహిళలు కలిసి పనిచేస్తున్నారని శ్రీ మోదీ చెబుతూ, మహిళల నాయకత్వంలో మహిళలే నిర్వహించే స్వయంసహాయ బృందాలను ప్రధానంగా దృష్టిలో పెట్టుకొని ఒక ఆధునిక అనుబంధ విస్తారిత వ్యవస్థను నిర్మించడానికి బడ్జెటులో పెద్దపీట వేసినట్లు వివరించారు. ప్రతి కుటుంబం సమృద్ధమవ్వాలన్నదే దీని లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రతి ఒక్క జిల్లాలోనూ బాలికల కోసం కొత్త హాస్టళ్లను నిర్మించడానికి ఉద్దేశించిన ఒక ఉద్యమం.. విద్యను మరింత మందికి అందుబాటులోకి తీసుకు వస్తుందని ఆయన వెల్లడించారు.

వ్యవసాయం, పాడి రంగం, చేపల పెంపకం ప్రభుత్వ అగ్రప్రాధాన్య రంగాలని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. కొబ్బరి, జీడిపప్పు, కోకో, చందనం సాగులో నిమగ్నమైన రైతుల కోసం ఈ బడ్జెటులో కీలక చర్యలు తీసుకున్నారని ఆయన తెలిపారు. భారత్ విస్తార్ ఏఐ సాధనం రైతులకు వారి సొంత భాషలో సమాచారాన్ని అందించి వారికి ఎనలేని మేలు చేస్తుందని ప్రధాని చెప్పారు.

మత్స్య రంగంలోనూ, పశు సంవర్ధక రంగంలోనూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అండదండలను అందించడం వల్ల పల్లెటూళ్లలో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు ఎక్కువగా అందుబాటులోకి వస్తాయని కూడా ఆయన వెల్లడించారు. ఈ బడ్జెటు అభివృద్ధి కోసం తపిస్తున్న బడ్జెటు, ఇది దేశ ప్రజల ఆకాంక్షల్ని నెరవేరుస్తుందని చెబుతూ ప్రధానమంత్రి తన స్పందనను ముగించారు. ఈ సందర్భంగా.. ముందుచూపు కలిగి ఉన్న బడ్జెటునూ, ప్రజల ఆశలను అర్థం చేసుకున్న బడ్జెటునూ, పేదలు, రైతులు, గ్రామాల సంక్షేమానికి అంకితమైన బడ్జెటునూ సమర్పించినందుకుకేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్‌కూ, ఆమె జట్టుకూ మరో సారి ఆయన అభినందనలు తెలిపారు.

